
సాక్షి
తూర్పుగోదావరి
ఆదివారం । 14 । ఏప్రిల్ । 2024



వాడపల్లికి పోటెత్తిన భక్తులు

వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయానికి శనివారం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. - 8లో ▸



డెల్టాకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం తూర్పు డెల్టాకు 2 వేలు, మధ్య డెల్టాకు 1,550, పశ్చిమ డెల్టాకు 3,600 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
40.0° / 26.5°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	40.0	22.0
కాకినాడ	35.3	26.5
అమలాపురం	39.0	26.0

న్యూస్‌రీల్

16న సీఎం బస్సు యాత్రను జయప్రదం చేయండి

వైఎస్సార్ సీపీ నేత మిథున్‌రెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 16న రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో నిర్వహించనున్న 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎంపీ, పార్టీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి ఎమ్మెల్యేలకు, పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. బస్సు యాత్ర నిర్వహణపై నగరంలోని హోటల్ మంజీరా సరోవర్‌లో ఎమ్మెల్యేలు, పార్టీ నేతలకు ఆయన శనివారం దిశానిర్దేశం చేశారు. ప్రజలకు పూర్తి స్థాయిలో సంక్షేమాన్ని అందించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న బస్సు యాత్రను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎంపీ అభ్యర్థి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

శ్లాష్ పరీక్ష సమర్థంగా నిర్వహించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈఓ వాసుదేవరావు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో ఈ నెల 16వ తేదీన స్టేట్ లెవెల్ అసెస్మెంట్ సర్వే (శ్లాష్) పరీక్ష జరుగుతుందని జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు తెలిపారు. స్థానిక బైపాస్ రోడ్డులోని డీఎంహెచ్ ఉన్నత పాఠశాలలో జిల్లా పరీక్షల నిర్వహణ సంస్థ (డీసీఈబీ) ఆధ్వర్యాన శనివారం నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ పరీక్షకు ఫీల్డ్ ఇన్విజిలేటర్లుగా నియమితులైన 121 మందికి శ్లాష్ లక్ష్యాలను వివరించారు. పరీక్ష నిర్వహణలో తీసుకోవలసిన జాగ్రత్తలు, సూచనలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పరీక్ష పిల్లల అభ్యసన స్థాయిపై సమీక్షకు ఎంతో అవసరమని చెప్పారు. డీసీఈబీ కార్యదర్శి దేవా అనిత మాట్లాడుతూ, పరీక్ష రోజు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఇవ్వవలసిన నివేదికల గురించి వివరించారు. మాస్టర్ ట్రైనర్లు అనిల్, శ్రీనివాస్‌లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరీక్ష విధానాన్ని వివరించారు. సందేహాలుంటే వెంటనే తమ దృష్టికి తీసుకుని రావాలని చెప్పారు. సమావేశంలో సమగ్ర శిక్షా ఏఎంవో గౌరీ శంకర్, డీసీఈబీ సభ్యులు కోలా సత్యనారాయణ పాల్గొన్నారు.

అప్పనపల్లి బాలాజీకి రూ.2.26 లక్షల ఆదాయం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయం శనివారం భక్తులతో కోలాహలంగా మారింది. శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువు తీరిన స్వామివారి దర్శనానికి భక్తులు భారీగా తరలి వచ్చారు. పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. కొందరు భక్తులు తలనీలాలు సమర్పించారు. భక్తులు భారీగా రావడంతో పాత గుడితో పాటు కొత్త గుడి కిక్కిరిసింది.

నిత్యం నిర్వహించే శ్రీలక్ష్మీ నారాయణ హోమం వైభవంగా జరిగింది. స్వామి వారికి రూ.2.26 లక్షలు ఆదాయం వచ్చిందని ఈఓ గ్రంధి మాధవి తెలిపారు. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.1.81 లక్షలు, నిత్యాన్నదానం ట్రస్టుకు విరాళంగా రూ.44,641 వచ్చాయన్నారు. 3,164 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని, 2,380 మంది అన్న ప్రసాదం స్వీకరించారని తెలిపారు.

ఫ్యాను జోరు.. సైకిల్ బేజారు



చాగల్లు మండలం ఊనగట్లలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌కృష్ణ, ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు



తండ్రికి మద్దతుగా ప్రచారం చేస్తున్న తలారి కుమార్తె శాలిని

- కొవ్వూరు ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న వైఎస్సార్ సీపీ
- ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావుకు ఆదరణ
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన మేలును వివరిస్తూ ముందడుగు
- ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌కృష్ణ తోడు
- కుమ్ములాటలతో కూటమి సతమతం

సాక్షి, రాజమహేంద్రవరం: కొవ్వూరు (ఎస్సీ) నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం జోరుగా జరుగుతోంది. సార్వత్రిక ఎన్నికల సంగ్రామం సమీపిస్తున్న తరుణంలో గోపాలపురం సిట్టింగ్ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. సీట్ల సర్దుబాటులో భాగంగా గోపాలపురం నియోజకవర్గం నుంచి కొవ్వూరుకు మారినా.. తనదైన శైలిలో ప్రజలతో మమేకమవుతున్నారు. కొత్త నియోజకవర్గమైనప్పటికీ నేతలు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందడుగు వేస్తున్నారు. ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రచారంలో ముందుంటున్నారు. కొవ్వూరు అభ్యర్థిగా ఆయన పేరును వైఎస్సార్ సీపీ ముందుగానే ఖరారు చేసిన విషయం తెలిసిందే. దీంతో ఆయన చాన్నాళ్ల నుంచే నియోజకవర్గమంతటా విస్తృతంగా పర్యటిస్తూ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కలుపుగోలుగా ముందుకు సాగుతున్నారు. ఇదే సమయంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మొదటి నుంచీ కుమ్ములాటల్లో మునిగి తేలుతోంది. అభ్యర్థి ప్రకటనలో సైతం తీవ్ర జాప్యం చేశారు. దీంతో కూటమి తరఫున టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ముప్పిడి వెంకటేశ్వరరావు ఎన్నికల ప్రచారంలో వెనుకంజలో ఉన్నారు.

ప్రజా ఆశీర్వాదం పేరిట..

ప్రజా ఆశీర్వాదం పేరిట వైఎస్సార్ సీపీ అభ్యర్థి తలారి వెంకట్రావు ఎన్నికల ప్రచారం సాగిస్తున్నారు. గోపాలపురం నియోజకవర్గంలో ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని ఇళ్లన్నీ సందర్శించిన ఎమ్మెల్యేగా ఖ్యాతి గడించారు. అదే స్ఫూర్తితో కొవ్వూరులో సైతం ప్రతి గడపకూ వెళ్తూ, ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తున్నారు. వారి కష్టసుఖాలు అడిగి తెలుసుకుంటున్నారు. కుటుంబంలో ఒకరిలా కలిసిపోతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని వివరిస్తున్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ ప్రభుత్వంలో జరిగిన మంచిని వివరిస్తున్నారు. భవిష్యత్తులో మరింత మంచి జరగాలన్నా.. పిల్లల భవిష్యత్తు బాగుండాలన్నా తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరుతున్నారు. దీంతో ప్రజలు తలారిని అక్కున చేర్చుకుంటున్నారు. హారతులు ఇచ్చి మరీ ఎన్నికల్లో గెలవాలని ఆశీర్వదిస్తున్నారు. సొంత మనిషిలా భావించి ప్రతి గ్రామంలోనూ ఘన స్వాగతం పలుకుతున్నారు. ప్రజల నుంచి విశేష స్పందన వస్తూండటంతో రెట్టింపు ఉత్సాహంతో తలారి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇప్పటికే తాళ్లపూడి మండలం తాడిపూడి గ్రామంలో ఇంటింటా ప్రచారం పూర్తి చేశారు. కొవ్వూరు పట్టణంలో సైతం సింహభాగం పూర్తి చేశారు. ఎన్నికల నాటికి నియోజకవర్గం మొత్తం చుట్టేయాలన్న తలంపుతో ముందుకెళుతున్నారు. ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని తెలుపుతూ కరపత్రాలు అందిస్తున్నారు.

రాజీవ్‌కృష్ణ తోడ్పాటు

తలారికి ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌కృష్ణ తోడ్పాటునిస్తున్నారు. ఎమ్మెల్యేతో పాటు ప్రచారంలో విస్తృతంగా పాల్గొంటున్నారు. టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో నేతల చేరికలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. ఇద్దరూ సమన్వయంతో వ్యవహరిస్తూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంలో సఫలీకృతులవుతూండటంతో ఇతర పార్టీల నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు పెరుగుతున్నాయి. ప్రతి సామాజికవర్గానికి చెందిన నేతలను కలుస్తూ వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని వారు కోరుతున్నారు.

తనయ సాయం

ఈ ఎన్నికల్లో తన తండ్రి తలారి వెంకట్రావును గెలిపించాలని కోరుతూ ఆయన కుమార్తె శాలిని సైతం విస్తృత ప్రచారం చేస్తున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి తన తండ్రి చేసిన మంచిని, రానున్న ఎన్నికల్లో నెగ్గితే చేయబోయే అభివృద్ధిని వివరిస్తున్నారు. అక్క, చెల్లి, అమ్మ, అన్న అంటూ అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, ప్రతి ఇంటికీ వెళ్లి మరీ ప్రచారం చేస్తున్నారు. ఆమెకు ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తోంది.

మళ్లీ వాళ్లిద్దరే..

కాంగ్రెస్ పార్టీ నుంచి రాజకీయ అరంగ్రేటం చేసిన తలారి వెంకట్రావు అనంతర పరిణామాల్లో వైఎస్సార్ సీపీలో చేరారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి, ఓడిపోయారు. 2019లో ఎన్నికల్లో టీడీపీకి చెందిన తన సమీప ప్రత్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావుపై అత్యధికంగా 37,461 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. తిరిగి అదే అభ్యర్థిపై ఈ ఎన్నికల్లో కొవ్వూరు నియోజకవర్గం నుంచి తలారి తలపడనుండటం విశేషం. ఈ పరిణామం ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

కూటమిలో వర్గవిభేదాలు

ఒకవైపు వైఎస్సార్ సీపీ ప్రచారంలో దూసుకుపోతూండగా.. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి వర్గవిభేదాలతో సతమతమవుతోంది. ఈ మూడు పార్టీలూ కలిసినప్పటికీ కూటమి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరావు ఎన్నికల ప్రచారంలో వెనుకబడుతున్నారు. వాస్తవానికి కొవ్వూరు సీటును మాజీ మంత్రి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్ ఆశించారు. దీనికోసం తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేశారు. అయితే, ఆయనకు టికెట్టు ఇస్తే ఊరుకునేది లేదని టీడీపీలోని ఆయన వైరివర్గీయులు అధిష్టానాన్ని గట్టిగా హెచ్చరించారు. ఆయనకు వ్యతిరేకంగా సమావేశాలు పెట్టారు. ఈ పరిణామాల నేపథ్యంలో జవహర్‌కు చంద్రబాబు మొండిచేయి చూపారు. కరివేపాకులా తీసి పారేశారు. దీంతో మండిపడిన ఆయన వర్గీయులు టీడీపీ ఫ్లెక్సీలు, చంద్రబాబు ఫొటోలు, టీడీపీ ప్రచార సామగ్రిని చించి పారేసి, దగ్ధం చేశారు. జవహర్‌కు టికెట్టు ఇవ్వాల్సిందేనని గట్టిగా పట్టుబట్టారు. మంగళగిరిలోని టీడీపీ రాష్ట్ర కార్యాలయానికి వెళ్లి మరీ ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ, చంద్రబాబు పట్టించుకోలేదు. చివరకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి ఇచ్చి సరిపెట్టేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ జవహర్ వర్గం ముప్పిడి వెంకటేశ్వరరావును సహకరించకుండా, ఆయనను దెబ్బ తీసేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. దీంతో, గెలుపుపై టీడీపీకి ధీమా లేకుండా పోయింది.

చంద్రబాబు దిష్టి బొమ్మ దహనం



బాలాజీపేట సెంటర్‌లో చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న శ్రీనివాసులురెడ్డి తదితరులు

రాజమండ్రి రూరల్: విజయవాడలో మేమంతా సిద్ధం బస్సు యాత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై దాడికి నిరసనగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పిలుపు మేరకు ప్రముఖ న్యాయవాది గొందేసి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు బొమ్మూరు బాలాజీపేట సెంటర్‌లో శనివారం అర్ధరాత్రి చంద్రబాబు దిష్టి బొమ్మ దహనం చేశారు.

రైలులో మహిళ ప్రసవం

తుని: బెంగళూరు నుంచి కృష్ణగంజ్ వెళుతున్న గౌహతి ఎక్స్‌ప్రెస్ రైలులో శనివారం ఓ మహిళ ప్రసవించింది. రైల్వే ఏఎస్సై అనిల్ కుమార్ కథనం ప్రకారం.. అస్సాం రాష్ట్రం కృష్ణగంజ్‌కు చెందిన హీన పర్వీన్, ఆమె భర్త షహనవాజ్‌తో కలిసి ఈ రైలులో ప్రయాణిస్తున్నారు. తుని సమీపానికి వచ్చేసరికి పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో 139 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేశారు. అధికారులు, రైల్వే పోలీసులు వెంటనే 108కు ఫోన్ చేసి అంబులెన్సును స్టేషన్‌లో సిద్ధంగా ఉంచారు. ఇంతలో నొప్పులు ఎక్కువ కావడంతో సహచర ప్రయాణికులు ఆమెను రైలులోని బాత్‌రూములోకి తీసుకుని వెళ్లి ప్రసవం చేశారు. ఆమె పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. తుని రైల్వే స్టేషన్‌లో రైలు ఆగగానే ఆర్‌పీఎఫ్ మహిళా పోలీసులు 108 ఈఎంటీ రమణబాబు స్ట్రెచర్‌ను ప్లాట్‌ఫాం వద్దకు తీసుకుని వెళ్లి, పర్వీన్‌ను, బిడ్డను తుని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు. పర్వీన్‌కు ముగ్గురు సంతానం ఉండగా నాలుగో కాన్పులో ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. ఆర్‌పీఎఫ్ మహిళా హెడ్ కానిస్టేబుళ్లు సునీత, వాగ్దేవి, శివాజీ, విష్ణుశంకర్‌ను అధికారులు అభినందించారు.

మండుటెండలో క్యాంపెయిన్!

- అడ్మిషన్లు చేస్తేనే జీతాలు
- కార్పొరేట్ స్కూళ్ల టీచర్లకు టార్గెట్లు



రాయవరం: 'సార్.. మీ అమ్మాయి / అబ్బాయిని మా స్కూల్లో చేర్పించండి. మీ పిల్లల్ని చేర్పించకుంటే మీ ద్వారా ఎవరైనా ఉంటే చెప్పండి. పది మందిని చేర్చాలని యాజమాన్యం టార్గెట్ విధించింది. లేకుంటే మా శాలరీ కట్ అవుతుంది. మాకూ టార్గెట్లు ఉన్నాయి. టార్గెట్ రీచ్ అవ్వక పోతే వచ్చే ఏడాది ఉద్యోగం నుంచి తొలగిస్తారు'. అంటూ ప్రైవేట్ స్కూల్ టీచర్లు మండుటెండలో క్యాంపెయిన్ చేస్తున్నారు. ప్రతి ఇంటికి తిరుగుతూ పిల్లల తల్లిదండ్రులను ప్రాధేయ పడుతున్నారు.

జిల్లాలో 456 ప్రైవేటు పాఠశాలలు

ప్రైవేటు/కార్పొరేట్ పాఠశాలల్లో పనిచేసే చిరుద్యోగుల బతుకులు చిత్తవుతున్నాయి. జూన్‌లో ప్రారంభమయ్యే విద్యా సంవత్సరానికి ఇప్పటి నుంచే విద్యార్థుల కోసం అడ్మిషన్ల వేట మొదలైంది. కొన్ని ప్రైవేట్ / కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు పెట్టే నిబంధనలకు ఆ పాఠశాలల్లో పనిచేయాలా, లేక బయటకు రావాలా అనే సందిగ్ధంలో ఉద్యోగులు సతమతమవుతున్నారు. జిల్లాలో దాదాపు 456 ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు ఉన్నాయి. వీటిలో సుమారు పదివేల మంది వరకూ సిబ్బంది పని చేస్తున్నారు.

టార్గెట్ చేరుకుంటేనే జీతాలు

ప్రైవేట్ / కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు గత నెల నుంచే ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను గ్రామాల్లోకి పంపిస్తున్నారు. వారు ప్రతి ఇంటికీ వెళ్లి మీకు పిల్లలు ఉన్నారా, ఏం చదువుతున్నారు అని వివరాలు తెలుసుకుని, పిల్లలను తమ పాఠశాలలో చేర్పించాలని కోరుతున్నారు. తమ పాఠశాలలో వసతులు చూడాలని, ఫీజులను పరిశీలించాలని, ఫలితాలు చాలా బాగుంటాయని ఏకరువు పెడుతున్నారు. కొందరు టీచర్లు తమ దగ్గర చదువుకునే పిల్లలను, వారి తల్లిదండ్రులను కూడా వారి ఇళ్ల దగ్గర వారినో, బంధువుల పిల్లలనో తమ స్కూల్లో చేర్చేలా చూడమంటూ ఒత్తిడి చేస్తున్నారు. ఎలాగోలా వారికి ఇచ్చిన అడ్మిషన్ల టార్గెట్ పూర్తి చేస్తేనే మార్చి, ఏప్రిల్ నెలల జీతాలు ఇస్తామని కొన్ని కార్పొరేట్ పాఠశాలలు నిబంధనలు పెట్టాయి. ఒక్కొక్కరూ 10 నుంచి 15 మంది పిల్లలను కచ్చితంగా పాఠశాలలో చేర్పించాలి. అలా చేర్పిస్తేనే జీతాలు ఇస్తారు. లేకుంటే జీతం రాదు. ఆ తర్వాత ఆ పాఠశాలలో ఉద్యోగం ఉంటుందో లేదో కూడా గ్యారంటీ లేదు. ఇచ్చే అరకొర జీతాలు నిలిపి వేస్తారనే భయంతో ప్రైవేటు ఉపాధ్యాయులు తంటాలు పడుతున్నారు.

ముక్కుపిండి ఫీజుల వసూలు

కొన్ని ప్రైవేటు పాఠశాలల సిబ్బంది చెబుతున్న ప్రత్యేకతలను విన్న తల్లిదండ్రులు ఆకర్షణకు లోనవుతున్నారు. ప్రభుత్వ, స్థానిక ప్రైవేటు పాఠశాలలకు మించి తమ స్కూళ్లలో సౌకర్యాలు ఉన్నాయంటూ సిబ్బంది చెబుతున్నారు. రోజువారి టెస్టులు, ప్రతి రోజు స్టడీ అవర్స్, కంప్యూటర్, లైబ్రరీ, ల్యాబ్, ప్రతి పండగ సెలబ్రేషన్, ఆటపాటలతో పాటు కరాటే, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉద్యోగులు బదిలీ అయితే అదే చోట బ్రాంచ్‌కు విద్యార్థుల బదిలీ సౌకర్యం కల్పిస్తామని వివరిస్తున్నారు. విద్యార్థులను పాఠశాలలో చేర్పించుకుని అడ్మిషన్ ఫీజు కట్టించుకునే వరకూ కేవలం పాఠశాల ఫీజు మాత్రమే చెబుతారు. అది చెల్లించిన తర్వాత బస్, యూనిఫాం, బుక్స్ ఫీజులంటూ ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. అప్పుడు ముందుగా క్యాంపెయిన్‌లో తిరిగి పిల్లలను చేర్పించిన ఉపాధ్యాయులపై తల్లిదండ్రుల ఒత్తిళ్లు పెరుగుతున్నాయి.

పవన్‌ను ప్రజలు నమ్మడం లేదు

మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్ముర్రి కనకారావు మాదిగ

పిఠాపురం: ముఖానికి మేకప్ వేసుకుని వచ్చే పవన్ కల్యాణ్‌ను ప్రజలు నమ్మడం లేదని మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్ముర్రి కనకారావు మాదిగ అన్నారు. పిఠాపురంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వంగా గీత, చలమలశెట్టి సునీల్‌కు మద్దతుగా ఆయన శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాలు అభివృద్ధి చెందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అధిక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీదేనన్నారు. చంద్రబాబు హయాంలో నలుగురికి పథకాలిచ్చి మిగిలిన దళితులందరినీ మోసం చేశారని చెప్పారు. నటన కోసం ముఖానికి రంగులు వేసుకునే జనసేన అధినేత పవన్ కల్యాణ్ పిఠాపురంలో నటించడానికి వస్తున్నారన్న సంగతిని ఇక్కడి ప్రజలు గమనించారని, అందుకే ఎవరూ ఆయనను నమ్మడం లేదని అన్నారు. నియోజకవర్గంలో ఎంత కాలం ఉంటారో ఆయనకే తెలియదని, ఇంక ప్రజలనేం ఉద్ధరిస్తారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేగా వంగా గీతను, ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. వైఎస్సార్ సీపీ విజయం కోసం తాము రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం చేస్తున్నామని, అన్నిచోట్లా వైఎస్సార్ సీపీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. ప్రజల ఉత్సాహం చూస్తుంటే సీఎం వైఎస్ జగన్ అంటున్నట్టుగానే 175కి 175 సీట్లు వచ్చేలా కనిపిస్తోందని, ఈ ఎన్నికలతో టీడీపీ, జనసేన, బీజేపీలు కాలగర్భంలో కలిసిపోవడం ఖాయమని కనకరావు అన్నారు.

శృంగార వల్లభునికి రూ.3.22 లక్షల ఆదాయం



ప్రత్యేక అలంకరణలో శృంగారవల్లభ స్వామి

పెద్దాపురం: తిరుపతి గ్రామంలో స్వయంభువుగా వెలసిన శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే సుమారు 15 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని, ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఆలయ కమిటీ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యాన ఏర్పాట్లు చేశారు. సుగంధ పరిమళాలు వెదజల్లే పూలమాలికలతో స్వామి వారిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ సేవల టికెట్లు, అన్నదానం, కేశఖండన ద్వారా స్వామి వారికి రూ.3,22,796 ఆదాయం సమకూరిందని ఈఓ శ్రీనివాస్ తెలిపారు. భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానంతో పాటు ఎండ తీవ్రత నేపథ్యంలో మజ్జిగ కూడా అందజేశారు.

స్ట్రాంగ్ రూములకు ఈవీఎంల తరలింపు

- పూర్తయిన స్కానింగ్ ప్రక్రియ
- పర్యవేక్షించిన కలెక్టర్ మాధవీలత



ఈవీఎంల తరలింపును పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్‌ల స్కానింగ్ ప్రక్రియను పూర్తి చేసి, తాత్కాలిక స్ట్రాంగ్ రూములకు తరలించామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. లాలాచెరువు వద్ద ఉన్న ఎఫ్‌సీఐ గోడౌన్లలోని జిల్లా సెంట్రలైజ్డ్ ఈవీఎం గోడౌన్‌లో భద్రపరిచిన ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలు, అనుబంధ యూనిట్లను ఆయా నియోజకవర్గాల తాత్కాలిక స్ట్రాంగ్ రూములకు తరలించే ప్రక్రియను మాధవీలత నేరుగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తొలి రోజు పార్లమెంటరీ నియోజకవర్గానికి కేటాయించిన బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్‌లను ఆయా నియోజకవర్గాల స్ట్రాంగ్ రూముల్లో భద్రపరచి సీల్ వేశామని తెలిపారు. రెండో రోజున అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్‌లను పంపించామని చెప్పారు. జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్, ఈవీఎం జిల్లా నోడల్ అధికారి, ఆర్డీఓ ఎ.చైత్రవర్షిణి, ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యాన నియోజకవర్గాల వారీగా ఈవీఎంలను పంపించామని తెలిపారు. ఈ మొత్తం ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించామని కలెక్టర్ మాధవీలత చెప్పారు.

నియోజకవర్గాలు వారీ వివరాలు

నియోజకవర్గం	స్ట్రాంగ్ రూము	పోలింగ్ కేంద్రాలు	బ్యాలెట్ యూనిట్లు	కంట్రోల్ యూనిట్లు	వీవీ ప్యాట్‌లు
అనపర్తి	శ్రీ రామారెడ్డి జెడ్‌పీపీ బాయ్స్ హైస్కూల్	228	273	273	296
రాజానగరం	ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం	216	259	259	280
రాజమండ్రి సిటీ	ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల	232	285	285	310
రాజమండ్రి రూరల్	నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ హాస్టల్	264	324	324	348
కొవ్వూరు	శ్రీ మావులేటి సోమరాజు సంస్కృత ఉన్నత పాఠశాల	176	211	211	228
నిడదవోలు	బాలికల జూనియర్ కళాశాల	205	246	246	266
గోపాలపురం	డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల	248	297	297	322

క్లుప్తంగా

మినీ బస్సును ఢీకొన్న లారీ



మినీ బస్సును ఢీకొన్న లారీ

తుని రూరల్: తుని మండలం గవరయ్య కోనేరు సమీపంలో ఎర్రవరం వెళుతున్న ప్రైవేట్ మినీ బస్సును వెనుక నుంచి లోడు లారీ ఢీకొంది. శనివారం జరిగిన ఈ సంఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న 14 మంది స్వల్పంగా గాయపడ్డారు. వీరంతా రొయ్యల ఫ్యాక్టరీలో పనిచేసేందుకు తుని, మర్లపాడు, చేపూరు తదితర గ్రామాల నుంచి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. స్వల్పగాయాలతో బయటపడిన క్షతగాత్రులను వేర్వేరు ఆస్పత్రులకు తరలించి చికిత్స చేయించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్సై రమేష్ బాబు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



మధు సునీల్ మృతదేహం

కాజులూరు: మండలంలోని ఉప్పుమిల్లిలో విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి చెందాడు. గొల్లపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యాళ్ల మధు సునీల్ (19) స్థానికంగా రొయ్యల చెరువులో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో చెరువు గట్టుపై చెత్తను కోస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ వైరుకు కొడవలి తగలి కోసుకుపోయింది. దీంతో కొడవలి ద్వారా విద్యుత్ ప్రవహించి మధు సునీల్ షాక్‌కు గురయ్యాడు. సహచర కూలీలు గమనించి యానాం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. గొల్లపాలెం ఎస్సై ఎం.తులసీరామ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ..

శంఖవరం: కత్తిపూడి – శంఖవరం రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొప్పిరెడ్డి దొరబాబు (34) మృతి చెందాడు. అన్నవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దొరబాబు కత్తిపూడికి ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. స్థానిక పెట్రోల్ బంక్ సమీపంలో అతడిని కత్తిపూడి నుంచి వస్తున్న టిప్పర్ వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన దొరబాబును 108లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దొరబాబు తాపీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు టిప్పర్ ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఐ.కిశోర్ తెలిపారు.

రైలు నుంచి జారిపడి..

తుని: స్థానిక జీఆర్పీ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని బయ్యవరం – నర్సింగిపల్లి మధ్యలో రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి (సుమారు 45 ఏళ్లు) మృతి చెందాడని తుని జీఆర్పీ ఇన్‌చార్జి ఎస్సై లోవరాజు తెలిపారు. శనివారం అందిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించామన్నారు. విశాఖపట్నం నుంచి విజయవాడ వైపు వెళుతున్న గుర్తు తెలియని రైలు నుంచి ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెందినట్టు భావిస్తున్నామన్నారు. మృతుడి ఒంటిపై నిక్కరు, లేత నాచురంగు టీషర్ట్ ఉన్నాయని, ఎడమ చేతిపై హిందీలో పచ్చబొట్టు ఉందన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

తెలుగింట వెలుగుల పండగ ఉగాది

- మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ వెంకటలక్ష్మీరెడ్డి
- పలువురికి ఉగాది నంది పురస్కారాల ప్రదానం



ఉగాది నంది పురస్కారాలు అందుకున్న ప్రముఖులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): తెలుగు వారి ఇంట వెలుగులు తెచ్చే పండగే ఉగాది అని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ గజ్జల వెంకటలక్ష్మీరెడ్డి అన్నారు. క్రోధినామ సంవత్సర ఉగాది సందర్భంగా శనివారం రాజమహేంద్రవరంలోని ధర్మంచర కమ్యూనిటీ హాలులో ఉభయ రాష్ట్రాలలోని ప్రముఖులకు ఉగాది నంది పురస్కారాలు ప్రదానం చేశారు. అమలాపురంలోని శ్రీసర్వణ కామేశ్వర పీఠం అధ్యక్షుడు మంగళంపల్లి కామేశ్వర సుబ్రహ్మణ్యం, కూచిభాస్కర రామం, వి.వరలక్ష్మి, అప్పాజీ వెంకటనారాయణగుప్తా, కవి, రచయిత డాక్టర్ ప్రసాదరావు తదితర 32 మందికి పురస్కారాలు అందించారు. ఈ కార్యక్రమానికి ముందుగా సుహానీ క్రియేషన్స్ దుర్దశ అనే నాటికను ప్రదర్శించింది. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్ అధ్యక్షతన ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ అద్దంకి రాజాయోనా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

సంస్కృతికి ప్రతిబింబం

గజ్జల వెంకటలక్ష్మీరెడ్డి మాట్లాడుతూ మన సంస్కృతికి ప్రతిబింబమైన ఉగాది అందరిలో ఆత్మీయతను నింపాలని ఆకాంక్షించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యురాలు, కళారత్న ఎస్పీ భారతి మాట్లాడుతూ మన సంస్కృతీ, సంప్రదాయాలకు పండగలు ప్రతీకలని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దృశ్యకళల అకాడమీ ఛైర్ పర్సన్ కుడుపూడి సత్య శైలజ మాట్లాడుతూ షడ్రుచుల ఉగాది పచ్చడిలా మన జీవితాలు కూడా ఉంటాయని, కష్టాలను అధిగమించి సుఖంగా జీవించడానికి సరైన మార్గాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని అన్నారు. డాక్టర్ కత్తిమండ ప్రతాప్ మాట్లాడుతూ ఫిలాంత్రోఫిక్ సొసైటీ చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఫిలాంత్రోఫిక్ సొసైటీ అధ్యక్షుడు రాజాయోనా మాట్లాడుతూ తమ సొసైటీ ద్వారా లలిత కళలను, కళాకారులను, సామాజిక వేత్తలను ప్రోత్సహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇండో ఆఫ్రికా ట్రేడ్ కౌన్సిల్ కమిషనర్ డాక్టర్ కేవీ రెడ్డి, ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ గుబ్బల రాంబాబు, వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మండెల శ్రీరామ్మూర్తి, మహిళా కమిషన్ సభ్యురాలు వినీత, బెహ్రెయిన్ తెలుగు సంఘ ప్రతినిధి రాయుడు వెంకటేశ్వరరావు, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు ధారావత్ బాల్‌సన్ నాయక్ పాల్గొన్నారు.

వాడపల్లికి పోటెత్తిన భక్తులు

ఆత్రేయపురం: వాడపల్లిలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామిని ఉదయం ప్రత్యేకంగా పువ్వులతో అర్చకులు అలంకరించారు. స్వామివారు పూర్ణ అలంకరణలో దర్శనమిచ్చారు. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. గౌతమీ గోదావరిలో స్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణలోని క్షేత్ర పాలకుడు అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయానికి భక్తుల రద్దీ నెలకొంది. సాధారణ భక్తులతో పాటు ఏడు వారాల నోము ఆచరిస్తున్న భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణంలో కిక్కిరిసింది. డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈఓ భూపతిరాజు కిషోర్‌కుమార్ మాట్లాడుతూ స్వామివారికి ప్రత్యేక దర్శనం, అన్న ప్రసాద విరాళం, సేవలు, లడ్డూ విక్రయం, విరాళాలు, ఆన్‌లైన్ ద్వారా రూ. 41,43,642 ఆదాయం సమకూరిందన్నారు. ఆలయం వద్ద ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ట్రాఫిక్‌ను నియంత్రించారు.



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

జీడిమామిడికి టీదోమ ముప్పు



శ్రీకృష్ణపట్నంలో జీడిమామిడి తోటలను పరిశీలిస్తున్న ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ నరసింహరావు

- తక్షణమే సస్యరక్షణ చర్యలు చేపట్టండి
- ఏరువాక కో ఆర్డినేటర్ నరసింహారావు

రాజానగరం: జిల్లాలో మెట్ట ప్రాంత రైతులకు ఆధారమైన జీడిమామిడిని టీదోమ ఆశించిందని, తక్షణమే సస్యరక్షణ చర్యలు చేపట్టి తోటలను కాపాడుకోవాలని దివాన్ చెరువులోని ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు సూచించారు. మండలంలోని శ్రీకృష్ణపట్నం, దివాన్ చెరువు, వెలుగుబంద గ్రామాల్లోని జీడిమామిడి తోటలను శనివారం రైతులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జీడిమామిడి తోటలు పిందె, కాయ పక్వానికి వచ్చే దశలలో ఉన్నాయన్నారు. ఈ సమయంలో టీ దోమ, తామరపురుగు వంటి రసం పీల్చే పురుగులు ఆశించడం వల్ల చిగురు, పిందె, పూత రాలిపోయి, చిగుర్లు మాడిపోవడమే కాకుండా పంట దిగుబడికి నష్టం కలుగుతుందని తెలిపారు. టీ దోమ ఉనికి డిసెంబర్ నుంచి ఉన్నప్పటికీ రైతులు సకాలంలో గుర్తించి, సస్యరక్షణ చర్యలు తీసుకోకపోవడం వలన కొన్ని ప్రాంతాలలోని తోటలలో చిగుర్లు మాడిపోతున్నాయన్నారు. వీటి నివారణకు మూడు దఫాలుగా పురుగు మందులను పిచికారీ చేయాలని సూచించారు.

నివారణా చర్యలు

మొదటి దఫా కొత్తగా చిగురు వచ్చే సమయంలో 1.6 మి.లీ మోనోక్రోటోపాస్ మందును ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. రెండో దఫా పూత వచ్చాక 2.5 మి.లీ క్లోరిపైరిపాస్ 20 ఈసీ మందును ఒక లీటర్ నీటిలో కలిపి చల్లాలి. మూడో దఫా గింజ బఠాణీ గింజ సైజులో ఉన్నప్పుడు 2 మి.లీ ప్రొఫెనోపాస్‌ను ఒక లీటరు నీటిలో పిచికారీ చేయాలని తెలిపారు. వీటిలో పైరెండు దఫాలలో ఆయా మందులు పిచికారీ చేయకపోతే మూడో దఫాలోనైనా ప్రొఫెనోపాస్‌తో పాటు కార్బండిజమ్ ఒక గ్రాము లేదా మాకోజెస్ 3 గ్రాములను ఒక లీటరు నీటిలో కలిపి చల్లాలని సూచించారు. తద్వారా టీ దోమతో పాటు తామర పురుగు, బ్లైట్ ఎండు తెగులును నివారించవచ్చు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): కాల్వ్యిజన్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక వైఎంవీఏ హాలులో రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు ఉత్సాహంగా జరిగాయి. సుమారు 230 మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీలను రాష్ట్ర చెస్ అసోసియేషన్ కార్యదర్శి భీమారావు ప్రారంభించారు. శనివారం సాయంత్రానికి నాలుగు రౌండ్లు పూర్తయ్యే సరికి పది మంది క్రీడాకారులు ముందంజలో ఉన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు వై.కల్యాణ్, జీవీ కుమార్, పి.హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రూ.59,500 స్వాధీనం

కొవ్వూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఔరంగబాద్‌లో వాహనాలను తనిఖీ చేస్తుండగా కారులో తరలిస్తున్న రూ.59,500 స్వాధీనం చేసుకున్నామని ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి సీహెచ్ పార్వతీ కల్యాణి తెలిపారు. ఏ విధమైన బిల్లు లేకుండా నగదు తరలిస్తుండడంతో సీజ్ చేసి పట్టణ సీఐ వి.జగదీశ్వరరావుకు అప్పగించామన్నారు.

సారా బట్టీలపై ఎస్ఈబీ దాడులు



ఈలకొలనులో సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్న సెబ్ అధికారులు

రంగంపేట: ఈలకొలను గ్రామంలోని సారా బట్టీలు, సారా విక్రయాలపై శనివారం సెబ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సారాబట్టీలను ధ్వంసం చేసి, 105 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 2400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసి, ముగ్గురిని అరెస్టు చేశారు. సెబ్ సీఐ ఎస్.రాంబాబు మాట్లాడుతూ ఈలకొలనుతో పాటు చుట్టుపక్కల తోటలు, పొలాల్లో తనిఖీలు నిర్వహించామన్నారు. ఈలకొలను గ్రామానికి చెందిన గుత్తుల సూరి బాబుకు చెందిన 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 90 లీటర్ల సారా, తయారీకి ఉపయోగించే సామగ్రి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అచ్యుతాపురంలో కురికూరి శ్రీను, అంచూరి రామాంజనేయులుకు చెందిన 1200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశామన్నారు. 145 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని నిందితుల్ని అరెస్టు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సెబ్ ఎస్సై జి.అనిల్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం అందజేత

పదేళ్లలో రూ.5 లక్షల విరాళం



ద్వారకాతిరుమల దేవస్థానం ఈవోకు విరాళం అందజేస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు నారాయణరావు

కొవ్వూరు: ద్వారకాతిరుమలలోని వేంకటేశ్వర స్వామి వారి నిత్యాన్నదాన ట్రస్టుకు కొవ్వూరు మండలం మద్దూరు సొసైటీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తోట నారాయణరావు రూ.50 వేల విరాళం ప్రకటించారు. గత పదేళ్లుగా ఈ ఆలయానికి ఏటా రూ.50 వేల చొప్పున మొత్తం రూ.ఐదు లక్షలు విరాళంగా అందజేశామని ఆయన తెలిపారు. శనివారం ఆలయ కార్యనిర్వహణాధికారి డీవీఎస్ఎన్ రాజుకు శనివారం విరాళం సొమ్మును నారాయణరావు అందజేశారు. రూ.5 లక్షల విరాళం అందించిన దాతలకు ఏడాది మూడుసార్లు అంతరాలయం దర్శనం, సర్వ కైంకర్యసేవకు దాత కోరిన రోజు అవకాశం కల్పించడంతో పాటు ముందు రోజు వసతి సౌకర్యం అందిస్తామని ఈవో తెలిపారు. కార్యక్రమంలో నారాయణరావు సోదరుడు తోట పోసిబాబు, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి

రామచంద్రపురం: పట్టణంలోని ప్రధాన రహదారిలో డివైడర్‌ను ఢీకొని యువకుడు అక్కడిక్కడే మృతి చెందాడు. రామచంద్రపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని వైఎస్సార్ నగర్‌కు చెందిన అయినవిల్లి ప్రసాద్ (28) శుక్రవారం రాత్రి మోటారు సైకిల్‌పై ద్రాక్షారామ నుంచి రామచంద్రపురం వస్తున్నాడు. కాకినాడ రోడ్డులో కుక్క రోడ్డుకు అడ్డంగా రావటంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. తీవ్ర గాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎదురెదురుగా వాహనాల ఢీ

మధురపూడి: ఎదురెదురుగా వాహనాలు ప్రమాదవశాత్తూ ఢీకొన్నాయి. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎవ్వరికీ గాయాలు కాలేదు. కోరుకొండ మండలం దోసకాయలపల్లి సమీపంలో శనివారం ఈ ప్రమాదం జరిగింది. రాజానగరం వైపు నుంచి వస్తున్న లారీని కోరుకొండ వైపు నుంచి వస్తున్న వ్యాను ఢీకొట్టింది. దీంతో లారీ ముందు చక్రం ఊడిపోయింది.



ఘటనా స్థలంలో వాహనాలు

విస్తృతంగా వాహనాల తనిఖీ



రామచంద్రపురంలో కేంద్ర బలగాలతో కవాతు చేస్తున్న పోలీసులు

అమలాపురం టౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా పోలీసు, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, ఎస్ఈబీ బృందాలు జిల్లాలో విస్తృత దాడులు, తనిఖీలు చేస్తున్నాయి. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఆధ్వర్యంలో ముమ్మరంగా జరుగుతున్నాయి. జిల్లాలో నిర్వహించిన దాడులు, తనిఖీల్లో 11 కేసులు నమోదు చేసి అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. 9 మందిని అరెస్ట్ చేశారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వాహనాల్లో తరలిస్తున్న నగదును సీజ్ చేస్తున్నారు. ఆ వివరాలను జిల్లా ఎస్పీ కార్యాలయం శనివారం రాత్రి విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపింది.

- ఐ.పోలవరం పోలీసు స్టేషన్ పరిధిలో రెండు కేసులకు సంబంధించి అక్రమ మద్యాన్ని తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 4 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 32 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 7.52 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు.
- అమలాపురం, ముమ్మిడివరం, ఆలమూరు, రాజోలు, కొత్తపేట పోలీసు స్టేషన్ల పరిధిలో 9 అక్రమ మద్యం కేసులకు సంబంధించి ఏడుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 2 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 164 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 33.39 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్, 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.
- రాజోలు ప్రాంతంలో నిఘా బృందాలు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ వాహనం నుంచి రూ. 54, 670 స్వాధీనం చేసుకున్నాయి.
- జొన్నాడ, గోపాలపురం, బొబ్బర్లంక, దిండి, ఎదుర్లంక, నరసాపురపు పేటల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల్లో శనివారం వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు.
- ఎన్నికల్లో సమస్యాత్మక గ్రామాలైన అంబాజీపేట మండలం వక్కలంక, ముక్కామల, పుల్లేటికుర్రు, ఇరుసుమండ గ్రామాల్లో ఆ మండల పోలీసు అధికారులతో పాటు కేంద్ర బలగాలు కవాతు చేశాయి.
- రామచంద్రపురం పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని మాలపాడు, కొత్తూరు ప్రాంతాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికల్లో ఓటు హక్కును నిర్భయంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఉపయోగించుకోవాలని ఆయా ప్రాంతాల ప్రజలకు పోలీసులు సూచించారు.

నేడు జిల్లా అరసం మహాసభ

అమలాపురం రూరల్: ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం(అరసం) అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రథమ మహాసభ అమలాపురం రూరల్ బండారులంకలో వీఎస్ఎం షాపింగ్ మాల్‌లోని ఆడిటోరియంలో ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు సంఘం కన్వీనర్, రచయిత గండి స్వామిప్రసాద్ శనివారం తెలిపారు. సభకు తూర్పుగోదావరి జిల్లా అరసం అధ్యక్షుడు పడాల వీరభద్రరావు అధ్యక్షత వహిస్తారని, ముఖ్య అతిథులుగా అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, అల్లూరి సీతారామరాజు యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మాజీ ఎంపీపీ పూటుకూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, సంగమం సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు డాక్టర్ చల్లా రవి కుమార్ తదితరులు హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరుగుతుందని స్వామిప్రసాద్ తెలిపారు.